క్లుప్తంగా

షెడ్డు నిర్మాణాన్ని నిలిపేయాలని వినతి



తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నమంగళారం గ్రామస్తులు

మొయినాబాద్: చెరువు శిఖంలో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులను నిలిపేయాలని చిన్న మంగళారం గ్రామస్థులు మండల తహసీల్దార్ కార్యాలయంలో గౌతమ్‌కుమార్‌కు విన్నవించారు. చిన్నమంగళారం రెవెన్యూలోని సర్వేనెంబర్లు 132, 133, 134లో గ్రామ సమీపంలో చిన్న చెరువు శిఖం పట్టా భూమి ఉందని, అందులో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి నిర్మాణపనులు అడ్డుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అవిశిపేట ఆంజనేయులుగౌడ్, ఎ రాములు, ఎం వెంకటేశ్, బి శంకర్, రాములు, కృష్ణ, బిక్షపతి, జహంగీర్, బాల్‌రాజ్, అంజద్, శివశంకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ప్రింటర్

పాస్‌బుక్కుల్లో వివరాల నమోదుకు ఆటంకం



రిపేర్‌లో ఉన్న ప్రింటర్

కొత్తూరు: కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి విభాగంలో పట్టాదారు పాస్‌బుక్కుల్లో వివరాలు నమోదు చేసే ప్రింటర్ గత ఐదు నెలలుగా పనిచేయడం లేదు. కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారికి పొలాల వివరాలు పాస్‌బుక్కుల్లో నమోదు కావడం లేదు. దీంతో తాము కొనుగోలు చేసిన పొలాల వివరాలను డాక్యుమెంట్, ఆన్‌లైన్‌ల్లోనే సరి చూసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రింటర్ పనిచేయడం లేదనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. మరో నాలుగు రోజుల్లో ప్రింటర్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన నాయకులు

కొందుర్గు: పులుసుమామిడి గ్రామంలో శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాత ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం తక్కువగా ఉండటంతో బోరుమోటార్లు సక్రమంగా నడవకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే 100 కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయించాడని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్ రెడ్డి, జహంగీర్, మహిపాల్ రెడ్డి, బలవంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో మొదటి బహుమతి

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఘనత



బహుమతి అందుకుంటున్న జావిద్

చేవెళ్ల: జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మొదటి బహుమతి దక్కింది. రామచంద్రపురంలోని సాయిగార్డెన్‌లో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదోతరగతి విద్యార్థి జావిద్ మొదటి బహుమతికి ఎంపికై నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థికి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు.

నర్సరీల్లో నారుమడే కీలకం

- పెరగని దిగుబడులు
- ఇబ్బందుల్లో కూరగాయల సాగు రైతులు
- మురుగు నీరు పారేలా చర్యలు



నాగర్‌గూడలో కూరగాయల నారుమడి

షాబాద్: చేవెళ్ల నియోజక వర్గంలోని నాలుగు మండల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగినట్లు దిగుబడులు పెరగడం లేదు. నారుమళ్లలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇందుకు కారణం. పంట దిగుబడి పెరుగుదలకు రైతులు పాటించాల్సిన పద్ధతులను చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి అశోక్ వివరించారు.

నేలలు మధ్యస్థంగా ఉండాలి..

నారుమడిగా చేసుకునే భూమిని లోతుగాదున్నాలి. నేలల బరువు మధ్యస్థంగా, నారుమడి పొడవు 150, వెడల్పు 120 సెంటీ మీటర్ల లోపు ఉండాలి. నులి పురుగులు రాకుండా నేలపై కార్బొఫ్యూరాన్ గుళికలు వేయాలి. ప్రతీ 10 చదరపు మీటర్లకు 40 నుంచి 50 కిలోల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. నారుమళ్లలో నారుకుళ్లు తెగులు వస్తుంది. ఇది రాకుండా ఉండేందుకు 0.1 శాతం క్యాప్టాన్ లేదా ఫార్మాల్డిహైడ్ 25 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి నేలను శుద్ధి చేయాలి. మొక్కలను చెద, గొంగళి పురుగులు ఆశిస్తాయి. విత్తనాలు విత్తడానికి ముందు క్లోరిఫైరిపాస్ 2 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి నారుమడి నేలను తడపాలి. రెండు నారుమళ్ల మధ్య, చుట్టూ 8 నుంచి 10 సెంటీ మీటర్ల లోతు, 30 సెంటీ మీటర్ల వెడల్పుతో కాలువలు తీసి మురుగు నీరు పారేలా చూసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి...

నారుమడిలో మొక్కలను తరచూ రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. మలాథియాన్ 2 మిల్లీ లీటర్ లేక ఎండోసల్ఫాన్ 2 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేయాలి. మొక్కలు బలహీనంగా ఉంటే ఒక శాతం యూరియా ద్రావణం స్ప్రే చేయాలి. ఎప్పటికప్పుడు కలుపు తీయాలి. నారు తీయడానికి ముందు నీరు పెట్టడం తగ్గించాలి. సాయంత్రం వేళలో నాటు వేస్తే మంచిది.

విత్తన శుద్ధి తప్పనిసరి...



విత్తే ముందు క్యాప్టాన్ లేదా థైరామ్ 3 గ్రాములను కిలో విత్తనానికి కలిపి తప్పనిసరిగా శుద్ధి చేయాలి. టమాటాలో విత్తనాన్ని అజోస్పైరిల్లమ్ వంటి బ్యాక్టీరియల్ కల్చర్‌తో కలిపి వేయాలి. ఎత్తు మడులపై చేతివేళ్లతో గానీ కర్రతో గానీ దగ్గరగా గీతలు గీసుకోవాలి. విత్తనాలను ఇసుకతో కలిపి వాటిలో పలుచగా చల్లాలి. విత్తనాలు వేసిన వెంటనే వరిగడ్డితో కప్పితే మొలక శాతం పెరగడంతో పాటు త్వరగా మొలకెత్తుతాయి. విత్తనం వేశాక ప్రతీ రోజు మధ్యాహ్నం, సాయంత్రం రోజ్‌క్యాన్లతో నీరు పెట్టాలి. ఎండాకాలంలో మొలకలకు ఎండ నుంచి రక్షణ కల్పించాలి.

– అశోక్, ఉద్యానశాఖ అధికారి, చేవెళ్ల డివిజన్

ముగిసిన వారణాసి రామయ్య ఉత్సవాలు



వార్షికోత్సవంలో పాల్గొన్న కళా బృందం

మొయినాబాద్ రూరల్: కనకమామిడి గ్రామంలో మూడు రోజులుగా శ్రీ సద్గురు వారణాసి రామయ్య వార్షికోత్సవం రామయ్య శిశ్య బృందం, గ్రామస్తులు కలిసి నిర్వహించారు. బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రంగస్థలం అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వారి సౌజన్యంతో శ్రీ కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ షాద్‌నగర్ వారి నిర్వహణలో మైరావన పౌరాణిక నాటకం నిర్వహించారు. రావణుడిగా రాష్ట్ర అవార్డు గ్రహిత కళశ్రీ వడ్ల రమేశ్ తన గాంభీరమైన సంభాషణ పటిమతో చక్కని నటనతో ప్రేక్షకులను మైమరిపించి నవ్వించారు. నారదుడిగా సంపంగి కృష్ణ అలరించారు. మైరావణుడిగా చెన్నయ్య, దేవేందర్‌గా శేఖర్ చక్కగా పాత్రలు పోషించారు. కనకమామిడి స్థానిక కళాకారులు వారణాసి రామయ్య శిశ్య బృందంచే శ్రీకృష్ణ రాయభారంలోని ద్వారక దృశ్యాన్ని ప్రభుచారి అర్జునుడిగా వెంకటప్ప, దుర్యోధనుడిగా మహేశ్ ప్రదర్శించారు. శ్రీ సద్గురు వారణాసి రామయ్య ప్రభువుల వార్షికోత్సవం వైభవంగా ముగిసింది. సెంట్రల్ ఫిల్మ్ ఫైనాన్స్ బోర్డు సభ్యుడు టీవీ రంగయ్య, సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ గవర్నింగ్ బాడీ మెంబర్ షాద్‌నగర్ ఆజీపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కళాజ్యోతి సంస్థ అధ్యక్షుడు రమేష్‌చారి పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తదితరులు

శంకర్‌పల్లి/చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఇండ్లకు 15శాతం, దుకాణాలకు 30శాతం పన్నులు విధించినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లోని ఇళ్లకు సమానంగా పన్నులు నిర్ణయించారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు

కందుకూరు: గ్రామాల్లో మౌలిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్, గోపాల్, ఎంపీడీఓ సరిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వందశాతం పూర్తి చేయాలని సూచించారు. అలాగే, 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఓటు నమోదుపై అవహగాన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు పనులు పెంచి, పని ప్రదేశాల్లో నీడ, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ దంపతులు, కుటుంబ సభ్యులు

షాద్‌నగర్ రూరల్: ఎలికట్ట అంబ భవానిమాత దేవాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అనురాధ దంపతులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, సమాజం బాగుండాలని కోరారన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, అన్నదాతలు సంతోషంగా ఉండాలన్నారు. ఆలయ పూజారులు భవానిశంకర్, మల్లేష్‌పూజారి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఎంపీటీసీల సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు కావలిశ్రీశైలం, రాజు, బసవేశ్వర్, శేఖర్, నెహ్రూనాయక్, శ్రీనివాస్, భగవాన్‌దాసు, పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



షాద్‌నగర్: విద్యార్థులతో ఉపాధ్యాయులు



షాద్‌నగర్ రూరల్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

హెచ్‌ఎం జయమ్మ

షాద్‌నగర్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హెచ్‌ఎం జయమ్మ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం, పదోతరగతి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున ప్రతీ విద్యార్థి సమయం వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పరీక్షలంటే భయపడొదన్నారు. ఒత్తిడిలో పరీక్షలు రాస్తే తక్కువ మార్కులు వస్తాయన్నారు. ధైర్యంగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. డీఈఓగా అమూల్య, ఆర్‌జేడీగా విశాల్, హెచ్‌ఎంగా వైష్ణవిలు వ్యవహరించారు.

షాద్‌నగర్ రూరల్‌లో..

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక్కరోజు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా సతీశ్‌కుమార్, డీఈఓగా శివకుమార్, ఎంఈఓగా చరణ్‌తేజ, ప్రధానోపాధ్యాయురాలిగా శ్రీజ, ఉపాధ్యాయులుగా అఖిల్, అక్షిత్, కీర్తిప్రభ, కాంత్రికుమార్‌గౌడ్, మహారాజు, మణికంఠ, వరప్రసాద్, దివ్యశ్రీ, అఖిల్, హర్షిణి, దివ్యశ్రీ, కీర్తన వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీదేవి, అరుణ, జ్యోతిలక్ష్మి, గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యాపోచయ్య పేర్కొన్నారు. ఎన్కెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కీర్తి తీసుకరావాలన్నారు.

తరగతి గదుల్లోనే విజ్ఞానం

ఏబీవీపీ కన్వీనర్ సూర్యప్రకాశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

చేవెళ్ల: విద్యార్థులు ఎక్కువ సమయం తరగతి గదుల్లో ఉంటేనే విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని శంషాబాద్ విభాగ్ కన్వీనర్ క్లెం సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట కమిటీ పిలుపు మేరకు చేవెళ్లలోని పలు కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో 'పరిసర్ చలో అభియాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరైతే విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల మధ్య మంచి స్నేహ బంధం ఏర్పడితే భవిష్యత్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, ప్రవీణ్, ధీరజ్, విజయ్, ప్రణయ్, నితీష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో నైపుణ్యం సాధించాలి

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుత్నున కాంచన లత

చేవెళ్ల: విద్యార్థులు వేసవిలో సమయం వృథా చేయకుండా గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉపాధి నైపుణ్యాల కోర్సులను నేర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లత పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎస్‌బీఐ సహకారంతో గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ నైపుణ్యకోర్సుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 రకాల నైపుణ్యాల కోర్సును సమ్మర్ క్యాంప్‌లో నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణ 30రోజుల పాటు ఉంటుందన్నారు. ఉపాధి కోర్సులతో స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ సర్వీసింగ్, రిపేరింగ్, టైలరింగ్, బ్యూటిపార్లర్, సీసీ టీవీ, కారు డ్రైవింగ్, జూట్ బ్యాగులు, కొవ్వొత్తులు, అగర్‌బత్తులు తయారి, పుట్టగొడుగుల పెంపకం, వంటివి నేర్చుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎ జ్యోతి, అధ్యాపకులు వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం..

కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ కాంచనలత ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వారి సహకారంతో 'పెయిర్ అండ్ రెస్పాన్సిబుల్ ఏఐ ఫర్ కన్స్యూమర్స్' అనే అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, మొయినాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్లు అనిల్, రాఘవేందర్‌లు మాట్లాడారు. ఆర్థిక పరమైన మోసాలపై ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు



పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సౌమ్యుడు, నిరాడంబరుడు వీర్లపల్లి శంకర్ మరిన్ని ఉన్నత పదువులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింలు, ఎజాజ్‌అలీ, వెంకటనర్సింహ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోకు తరలిన బీజేపీ శ్రేణులు



మల్కాజిగిరి రోడ్‌షోకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

చేవెళ్ల: ప్రధాని నరేంద్రమోదీ రోడ్‌షోకు చేవెళ్ల నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో మల్కాజిగిరికి తరలి వెళ్లారు. శుక్రవారం చేవెళ్ల మార్కెట్‌యార్డు నుంచి బస్సుల్లో మండల పార్టీ ఆధ్వర్యంలో వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం ఖాయమన్నారు. రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ స్థానాలను అందిస్తామన్నారు. మోదీ పర్యాటన, రోడ్‌షోలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రాబోయే కాలం బీజేపీదేనని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో శర్వలింగం, క్రిష్ణగౌడ్, భవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్, అభిలాష్, క్రిష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మండల కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు మహేందర్

షాబాద్: కురుమ కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మండల కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు కూతురు మహేందర్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా అనాదిగా కురుమలు అణిచివేతకు గురవుతున్నారని చెప్పారు. రాజకీయంగా ఉద్యోగపరంగా ప్రభుత్వాలు గొల్ల కులస్థులతో కురుమలను కలుపుతూ అన్యాయం చేసున్నారని ఆరోపించారు. తమ రిజర్వేషన్‌లో కూడా అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రహించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయించేవిధంగా తగిన కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జాకీషరీఫ్

షాబాద్: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జాకీషరీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేషన్ల ఏర్పాటుతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అన్ని కులాల కార్పొరేషన్ల ఏర్పాటు కోసం ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. వంద రోజుల్లోనే కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియడారు.

రూ.1.65 కోట్లు పలికిన వారాంతపు సంత

తుక్కుగూడ: తుక్కుగూడ వారాంతపు సంత (తైబజార్) రూ.కోటి 65 లక్షల 25 వేల పలికినట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వారాంతపు సంత వేలం పాట శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించమన్నారు. ఇందులో 17 మంది పాల్గొన్నగా మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామవాసి పేల రాజు వేలం పాడి దక్కించుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కౌన్సిలర్లు శివకుమార్, విలాస్, సుమన్, భావన, రాజు, మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది జంగయ్య, మల్లేశ్, స్థానికులు పాల్గొన్నారు.